



కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్ అగర్వాల్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

జిల్లా పరిషత్‌కు ఐసీఏఐ అవార్డు

ఢిల్లీలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మచిలీపట్నం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్‌కు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) లభించింది. ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్ అగర్వాల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమంగా అకౌంట్స్ నిర్వహించినందుకుగాను ఉత్తమ జిల్లా పరిషత్‌గా ఎంపికైంది. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీడీవో సిహెచ్.వెంకటేష్ పాల్గొన్నారు. కాగా, జాతీయ స్థాయిలో ఐసీఏఐ అవార్డు అందుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికకు కలెక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

శబ్దం లేకుండా కారు అద్దం పగులకొట్టి రూ.3 లక్షలు చోరీ

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఘటన

- రెడ్‌కలర్ పల్సర్ వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు
- సీసీ పుటేజీ ఆధారంగా విచారణ ముమ్మరం

మచిలీపట్నం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో నిలిపి ఉన్న కారు అద్దాన్ని శబ్దం రాకుండా పగులకొట్టి అందులోని రూ.3 లక్షలను గుర్తుతెలియని దండగులు అపహరించిన ఘటన మిగతా 6లో..



నగదు చోరీ జరిగిన కారు ఇదే



జిల్లాలో మారని పోలీసుల తీరు!

పేకాటలో పట్టుకున్న బండికి రూ.5 వేలు, సెల్‌ఫోన్‌కు రూ. 1,000 ధర నిర్ణయం

జిల్లాలో పోలీస్ అధికారుల రూటే సప'రేటు'గా ఉంది. ఒక్కో పనికి ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పేకాట శిబిరాల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు రూ.5 వేలు, సెల్‌ఫోన్‌కు రూ.1000 చొప్పున తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. యథేచ్ఛగా జూదాలు నిర్వహించుకోండి మాకు మాత్రం మామూళ్లు పంపించండి అన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనితీరు మార్చుకోవాలని జిల్లా అధికారి చేస్తున్న హెచ్చరికలు తమకు పట్టవు అన్నట్లు ఉంటున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

- జూద శిబిరాల వైపు కన్నెత్తి చూడకుండా మామూళ్లు!
- రోడ్డుప్రమాదం కేసులో పేరు మార్పులో అత్యుత్సాహం
- ఉన్నతాధికారి హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న కిందిస్థాయి అధికారులు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నంలో కోనేరు సెంటరుకు సమీపంలో ఉన్న ఖోజ్జిల్లిపేటలో ఇరువురు నాసీల ఆధ్వర్యంలో గృహాల్లో జోరుగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోజుకో గృహాన్ని ఎంచుకుని మరీ పేకాట శిబిరాలు నడుపుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ పేటలో ఇరుకుగా ఉన్న రోడ్లపైనే కేంద్రాలుగా చేసుకుని పేకాటలు నిర్వహిస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై పేకాట రాయుళ్లు తిరగబడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలానెలా మామూళ్లు ముట్టచెబుతున్నామని.. పోలీసులు తమను పట్టించుకోరని నిర్వాహకులు బాహాటంగానే చెబుతుండటం గమనార్హం. ఈ ప్రాంతంలోని ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ఒక గుడి సమీపంలోని ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

- బందరుకోట రోడ్డు వెంబడి ఉన్న డిగ్రీ కళాశాలకు సమీపంలో ఒక బడ్డీ వద్ద ప్రతిరోజు యువకులు మద్యం, గంజాయి తాగుతున్నారు. గంజాయి మత్తులో వాహనాలను రహదారిపై అడ్డదిడ్డంగా పెడుతున్నారు. కళాశాల విద్యార్థులకు, స్థానికంగా నివాసం ఉండేవారికి ఇబ్బందికరంగా ఉందని పలుమార్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు.

వాహనం ఇవ్వాలంటే డబ్బు చెల్లించాల్సిందే..

మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కొత్త పద్ధతులకు తెరతీశారు. పేకాట శిబిరాలపై దాడులు చేసిన సమయంలో దొరికిన వారిపై కేసులు నమోదు చేయకుండా కొత్తరకం వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇటీవల గుండుపాలెం, రుద్రవరం, వెంకట దుర్గాంబపురంలో పేకాట ఆడేవారిని పట్టుకుని వారి ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా ఒక్కో ద్విచక్ర వాహనానికి రూ.5వేలు, సెల్ ఫోన్‌కు వెయ్యి రూపాయల చొప్పున మధ్యవర్తుల ద్వారా తీసుకుని వదిలేస్తున్నారు. ఇలా పట్టుబడిన వారు తాము నగదు చెల్లించి బయటపడ్డామని బాహాటంగా చెప్పడం గమనార్హం.

- మచిలీపట్నం రూరల్ మండలంలో చేపలు, రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ మోటార్లు, వైర్‌లు, ముతకట్టల దొంగతనాలు ఇటీవల కాలంలో ఒక ముఠా చేస్తోంది. రొయ్యల చెరువుల యజమానులు దొంగలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. ఇటీవల తుమ్మలచెరువు గ్రామంలో ఆలయాల నగదు లెక్కింపు సమావేశం జరిగింది. అవినీతికి పాల్పడిన వైసీపీ నాయకుడికి మద్దతుగా పోలీసులు అక్కడికి వెళ్లడంతో గ్రామస్తులు తిరగ బడ్డారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారిందనే వాదన వినపడుతోంది. ఇదే విషయాన్ని గ్రామస్తులు పోలీస్ అధికారులకు తెలియజేశారు.

- గూడూరు మండలం తరకటూరు వద్ద గతేడాది డిసెంబరు 27న ఒక అధికారి తన కారులో మచిలీపట్నం వస్తుండగా తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న చీడేపూడి రవికుమార్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ధర్నాకు ఉపక్రమిస్తే వారిని గూడూరు పోలీసులు తమదైన శైలిలో బెదిరింపులకు గురిచేశారు. ఘటన జరిగిన సమయంలో కారు నడుపుతున్న వ్యక్తిని కాకుండా వేరే డ్రైవర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చారనే విమర్శలు ఉన్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత దహనం చేసేవరకు పోలీసులు మృతుని బంధువులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో ఈ కుటుంబంలోని ముగ్గురు ఆడపిల్లలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, అన్యాయం చేయవద్దని పోలీసులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ఈరోడ్డు ప్రమాదం ఘటనలో పోలీసులు సదరు అధికారికి పూర్తిస్థాయి సహాయసహకారం అందించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అటు నుంచి ఇటు

దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లోని విజయవాడ డివిజన్ పరిధిలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు విశాఖపట్నం డివిజన్‌ను కేటాయిస్తూ భౌగోళిక సరిహద్దులు నిర్ణయించి, డీపీఆర్ తయారు చేయమని ఆదేశాలు జారీ చేయటంతో విజయవాడ రైల్వే డివిజన్‌లో మార్పులు అనివార్యమయ్యాయి. ఫలితంగా విజయవాడ రైల్వే డివిజన్ పూర్వస్థితికి చేరుకోనుండగా, అమరావతి రైల్వేలైన్‌లోని కీలకమైన స్టేషన్లు సికింద్రాబాద్ డివిజన్ నుంచి వేరుపడి విజయవాడ డివిజన్‌లో కలవనున్నాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

విజయవాడ రైల్వే డివిజన్‌లో మార్పులు చేర్పులు

- విశాఖ డివిజన్ ఏర్పాటు చేయాలన్న కేంద్ర నిర్ణయం వల్లే..
- పాత డీపీఆర్ ప్రకారం నౌపాడ వరకు విజయవాడ డివిజన్
- తాజాగా దువ్వాడ వరకు కుదించే అవకాశం
- సికింద్రాబాద్ డివిజన్‌లోని కొన్ని స్టేషన్ల విలీనం
- కొండపల్లి-మోటుమర్రి వరకు విలీన ప్రతిపాదన
- మొత్తం 8 రైల్వేస్టేషన్లు కలిసే చాన్స్

అమరావతి నూతన రైల్వేలైన్‌ను దృష్టిలో పెట్టుకునే..



పాత డీపీఆర్ ప్రకారం విజయవాడ డివిజన్

ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా అనకాపల్లి, దువ్వాడ వరకు విజయవాడ డివిజన్ కొనసాగుతోంది. గతంలో విశాఖను డివిజన్‌గా ప్రకటించకపోవటంతో పలాస (నౌపాడ) వరకు విజయవాడ డివిజన్ పరిధిలోకి చేర్చారు. దీనివల్ల విజయవాడ రైల్వే డివిజన్ పరిధి ప్రస్తుతం ఉన్న దాని కంటే రెండు రెట్లు పెరిగింది. నౌపాడ వరకు 202 కిలోమీటర్ల మేర అదనంగా విజయవాడ డివిజన్‌లో అంతర్భాగంగా నిర్ణయించారు. అలాగే, అరకు లైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి చేర్చారు. రూట్ కిలోమీటర్లు, రన్నింగ్ కిలోమీటర్లు రెండు రెట్ల పెరుగుదలతో పాటు ఎలక్ట్రికల్-డీజిల్ లోకోషెడ్లు, కోచింగ్ డిపోలు, వ్యాగన్ వర్క్‌షాప్‌లు తదితర అనేక రైల్వే ఆస్తులు విజయవాడ డివిజన్‌లో విలీనానికి ప్రతిపాదించారు. గజిటెడ్ ఉద్యోగులు తప్ప విశాఖ, వాల్తేరు పార్ట్‌లోని ఉద్యోగ, కార్మికులు ఎక్కడివారు అక్కడే పనిచేస్తారని, వీరంతా విజయవాడ డివిజన్ పరిధిలోకి వస్తారని అప్పట్లో పేర్కొన్నారు. దీనివల్ల పాత డీపీఆర్‌కు ముందు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 450 కిలోమీటర్ల రూట్ లెంగ్త్, రన్నింగ్ ట్రాక్ 979 కిలోమీటర్లుగా ఉంది. పాత డీపీఆర్ ప్రకారం విశాఖపట్నం డివిజన్ లేనందున విజయవాడ డివిజన్ పరిధిలో రూట్ లెంగ్త్ 1,414 కిలోమీటర్లు, రన్నింగ్ ట్రాక్ 2,631 కిలోమీటర్లకు చేరుకుంది. దక్షిణ కోస్తా జోన్ పరిధిలో గుంటూరు, గుంతకల్ డివిజన్ల కంటే కూడా విజయవాడ డివిజన్‌లోనే అత్యధికంగా 2,631 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్ ఉండేలా ప్రతిపాదించారు.

కొత్త డీపీఆర్ ప్రకారం విజయవాడ డివిజన్

తాజాగా కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం డివిజన్‌ను ప్రకటించి, డీపీఆర్‌కు ప్రతిపాదించటంతో పైన చెప్పుకున్నవన్నీ విజయవాడ డివిజన్ నుంచి వేరుపడనున్నాయి. దువ్వాడ వరకు మాత్రమే విజయవాడ డివిజన్ కొనసాగుతుంది. కానీ, అదనంగా ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి చేరనున్నాయి.

కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు..

ఇప్పటి వరకు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి రైల్వే రూట్‌ను విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి విలీనం చేసేందుకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. వీటి ప్రకారం కొండపల్లి నుంచి మోటుమర్రి వరకు దాదాపు 65 కిలోమీటర్ల వరకు రైల్వేరూట్ అదనంగా విజయవాడ డివిజన్ పరిధిలోకి రానుంది. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి చెరువు మాధవరం, గంగినేని, ఎర్రుపాలెం, తొండల గోపవరం, మధిర, మోటుమర్రి జంక్షన్, మోటుమర్రి బైపాస్ స్టేషన్లు విజయవాడ డివిజన్ పరిధిలోకి వస్తున్నాయి.

అమరావతి రైల్వేలైన్ కోసమే..

దక్షిణ మధ్య రైల్వేజోన్‌లోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న కొండపల్లి-మోటుమర్రి సెక్షన్‌ను విజయవాడ రైల్వే డివిజన్‌లో విలీనం చేయనుండటం వెనుక ప్రధానంగా అమరావతి రైల్వేలైనే ముఖ్య ఉద్దేశంగా అనిపిస్తోంది. అమరావతి రైల్వేలైన్ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర ప్రతిపాదితమైంది. ఎర్రుపాలెం, మిగతా 6లో..

ప్రచార హోరు..!

నామినేషన్లకు ముందే ఎమ్మెల్సీ అభ్యర్థుల జోరు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు
- ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు పోటాపోటీ



ఆలపాటి రాజా లక్ష్మణరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో నామినేషన్లకు ముందే పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కాక రేగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) బలపరిచిన కేఎస్ లక్ష్మణరావు.. ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. వీరిద్దరూ ప్రచారంలో ఊపు పెంచారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఆలపాటి, ఆత్మీయ సమావేశాల పేరుతో కేఎస్.. కొద్దిరోజులుగా పతాక స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ఈ దఫా ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశముంది. కాగా, ఈ ఎన్నికల నుంచి వైసీపీ తప్పుకొంది. కానీ, నామినేషన్ల ఘట్టం పూర్తయ్యాక పోటీలో ఉన్నదెవరో తెలుస్తుంది. అయితే, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కానీ, కేఎస్ లక్ష్మణరావు కానీ.. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందినవారు కాదు. ఇద్దరూ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందినవారే. ఉమ్మడి కృష్ణాతో చక్కటి సత్సంబంధాలు కలిగి ఉన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్ : టీడీపీ నాయకుడిగా ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడు. ఆ తర్వాత ఆయన ప్రయాణం చంద్రబాబుతో సాగింది. స్వాతంత్ర్య సమరయోధుడు ఆలపాటి శివరామకృష్ణ తనయుడు. గుంటూరు జిల్లాలో జన్మించిన ఆయన అక్కడే ప్రాథమిక విద్యనభ్యసించారు. స్టూడెంట్స్ వర్కింగ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. బీఎల్ పూర్తి చేశారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. రెండోసారి 1999లో గెలిచాక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో విజయం సాధించారు. 2019లో ఓటమి చెందారు. 2024లో ఆయన తెనాలి నుంచి పోటీ చేయాలనుకున్నా.. కూటమి పొత్తులో భాగంగా ఆ సీటును నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. ఆలపాటి విజయానికి కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి.

కేఎస్ లక్ష్మణరావు : మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కూడా బలమైన అభ్యర్థే. గుంటూరు జిల్లాలో జన్మించిన లక్ష్మణరావు అక్కడి హిందూ కళాశాలలో రాజకీయశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్)లో చురుగ్గా ఉంటూ ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల కోసం అనేక ఉద్యమాలు చేశారు. 2007లో తొలిసారిగా కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీపడి ఎక్కువ మెజారిటీతో విజయం సాధించారు. 2015లో ఓటమి పొందారు. 2019లో కృష్ణా-గుంటూరు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీచేసి విజయ సాధించారు. లక్ష్మణరావు హిందూ కాలేజీ లెక్చరర్‌గానే కాకుండా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణలు ఇస్తూ చాలామందికి సుపరిచితులయ్యారు. గ్రూప్-1 పరీక్షలకు శిక్షణతో పాటు ఐఏఎస్‌లు కావాలనుకునే వారికి కూడా తర్ఫీదునిచ్చేవారు. ప్రజా సంఘాలను ఆధారంగా చేసుకుని ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు.

రేపు ఆలపాటి, 10న కేఎస్ నామినేషన్లు

ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ నెల 7వ తేదీన నామినేషన్ దాఖలు చేయటానికి సన్నాహాలు చేసుకుంటుండగా, కేఎస్ లక్ష్మణరావు మాత్రం 10వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

రసాయనాల కథ నడిపిందెవరు?

- నకిలీ పత్రాలతో వచ్చిన ట్యాంకర్
- జగ్గయ్యపేటలోని పీపీయూకు వెళ్తున్నట్టు లేఖ
- వ్యర్థాలు రావడం వెనుక జక్కంపూడి వాసి హస్తం ఉన్నట్టు అనుమానం
- రంగంలోకి కాలుష్య నియంత్రణ మండలి
- వైజాగ్, జగ్గయ్యపేటలో సోదాలు



జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లో రసాయనాల ట్యాంకర్

"జక్కంపూడి శివారులోని ఖాళీ భూముల్లో పోసిన వ్యర్థాల వెనుక కెమికల్ మాఫియా ఉందా? ఎక్కడో వైజాగ్ నుంచి రసాయన వ్యర్థాలు ఇక్కడికే ఎందుకు వస్తున్నాయి? గ్రామంలో ఎవరైనా మాఫియాతో చేతులు కలిపారా? నాలుగైదు నెలల నుంచి రసాయన వ్యర్థాలు ఈ కారణంగానే ఇక్కడికి వస్తున్నాయా?" జక్కంపూడిలోని ఖాళీ భూముల్లో పోసిన వ్యర్థాల వ్యవహారంలో తాజాగా ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు ఇవి. ఈ నేపథ్యంలో బిహార్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్‌ను కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోపక్క ఈ వ్యర్థాల వ్యవహారం నిగ్గు తేల్చడానికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రంగంలోకి దిగారు. అధికారులు కూపీ లాగుతున్న కొద్దీ కొత్తకొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జక్కంపూడిలో పోస్తున్న వ్యర్థాల సమాచారాన్ని వైజాగ్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు జిల్లా అధికారులు చేరవేశారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/చిట్టినగర్): జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లో పోస్తున్న వ్యర్థాలు వైజాగ్‌లోని క్రెబ్స్ బయో కెమికల్స్ ఫార్మా కంపెనీ నుంచి వచ్చినట్టుగా ట్యాంకర్ డ్రైవర్ వద్ద ఉన్న కాగితాలను బట్టి తెలుస్తోంది. ఈ ట్యాంకర్ జగ్గయ్యపేటలో ఉన్న పీపీయూ (ప్రీ ప్రాసెసింగ్ యూనిట్)కు వెళ్తున్నట్టు ఆ కాగితాల్లో ఉంది. దీని ప్రకారం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ జగ్గయ్యపేటలోని పీపీయూలో బుధవారం సోదాలు నిర్వహించారు. అక్కడున్న సిబ్బందిని విచారించారు. వైజాగ్ నుంచి ట్యాంకర్ వ్యర్థాలతో తమ ప్లాంట్‌కు వస్తున్నట్టుగా సమాచారం రాలేదని చెప్పారు.

వ్యర్థాల రవాణా చేయాల్సిన పద్ధతి ఇది..

ఫార్మా కంపెనీల్లో మందుల తయారీలో రకరకాల రసాయనాలను ఉపయోగిస్తారు. వాటి ద్వారా వ్యర్థాలు బయటకు వస్తాయి. వాటిలో కెలోరిఫిక్ విలువలు ఉంటాయి. కర్మాగారాల్లో ఉండే బాయిలర్‌లను మండించడానికి కెలోరిఫిక్ ఉపయోగపడుతుంది. ఇలా వచ్చిన వ్యర్థాలను సిమెంట్ తయారీ కర్మాగారాల్లో కిలెన్‌లోని బొగ్గును మండించడానికి ఉపయోగిస్తారు. ఫార్మా కంపెనీ నుంచి వ్యర్థాలతో బయలుదేరిన ట్యాంకర్ ముందుగా పీపీయూకు చేరుకోవాలి. అక్కడ వాటిని శుద్ధి చేసిన తర్వాత సిమెంట్ కంపెనీలకు పంపుతారు. ఇలా ఫార్మా కంపెనీల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారబోయకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఒక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫార్మా కంపెనీ నుంచి బయలుదేరే ట్యాంకర్‌కు కచ్చితంగా జీపీఎస్ పరికరం ఉండాలి. ఏ నంబరు గల మిగతా 6లో..

మచిలీపట్నం-ధనపూర్ మధ్య మహాకుంభ్‌కు ప్రత్యేక రైళ్లు

8లో



వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి వసంతోత్సవం

- పూర్ణాహుతితో ముగిసిన కల్యాణోత్సవాలు
- తరలివచ్చిన భక్తులు

6లో

సంగమ స్నానం.. ఆంక్షలు ఘోరం!

6లో



రికవరీ చేసిన సెల్‌ఫోన్లు చూపుతున్న ఎస్పీ గంగాధరరావు, పోలీస్ అధికారులు

6లో

రూ.36 లక్షల విలువైన 310 మొబైల్స్ రికవరీ

రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేయండి

- ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా మార్చండి
- పౌరసరఫరాల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలోని 957 రేషన్ దుకాణాలు, ఏడు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, నివేదికలు సమర్పించాలి. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతినెలా 20 దుకాణాలను, తహసీల్దార్లు నెలకు ఐదు దుకాణాలను తనిఖీ చేయాలి. ఎంఎల్ఎస్ పాయింట్లను పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌరసరఫరాల అధికారి తనిఖీ చేయాలి. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా మార్చాలి.' అని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరు, తనిఖీలు, ఉల్లంఘనల్లో కేసుల నమోదుపై పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్‌గౌర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. కాన్ఫరెన్స్ అనంతరం పౌరసరఫరాల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. 2024 జూలై నుంచి డిసెంబరు వరకు 6ఏ కేసులు 119 నమోదయ్యాయని, ఇకపైనా క్రియాశీలంగా పనిచేసి, ఉల్లంఘనలపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎండీయూ ఆపరేటర్లు పారదర్శకంగా సరుకులు అందించేలా చూడాలన్నారు.

1,09,665 టన్నుల ధాన్యం సేకరణ

ఎన్టీఆర్ జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణపైన పౌరసరఫరాల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్షించారు. ఇప్పటివరకు 16,217 మంది రైతుల నుంచి రూ.254 కోట్ల విలువైన 1,09,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు, డీఎస్వో ఎ.పాపారావు పాల్గొన్నారు.



కృష్ణామిల్క్ యూనియన్ తొలి చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబును సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

ప్రగతి పథంలో విజయ డెయిరీ

- పశుపోషకులు, వినియోగదారుల ఆదరణే కారణం
- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పామర్రు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'పశుపోషకులు, పాలవినియోదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృష్ణా మిల్క్ యూనియన్(విజయ డెయిరీ) సేవలందిస్తోంది. పశుపోషకులు, వినియోగదారుల ఆదరణతో ప్రగతి పథంలో పయనిస్తోంది. 60 వసంతాల్లోకి అడుగుడి వజ్రోత్సావాలకు సిద్ధమవుతోంది.' అని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. జమీగొల్వేపల్లి పాలకేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పాడిరైతు సంక్షేమం మన మతం- అలుపెరగని సేవ మన అభిమతం కార్యక్రమానికి యూనియన్ శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ నుంచి రూ.4.12 కోట్ల నిధులు, ఎన్‌డీడీ బోర్డు నుంచి రూ.4.12 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ ష్యూరిటీతో మరో రూ.4.12కోట్ల రుణాలను ముఖ్యమంతి చంద్రబాబు ద్వారా సంస్థ అభివృద్ధికి ఇప్పించామన్నారు. జమీగొల్వేపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర డెయిరీ అభివృద్ధి, కృష్ణామిల్క్ యూనియన్ తొలి చైర్మన్ వల్లభనేని రాజేంద్రబాబు, పాల సంఘ అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులను చలసాని సత్కరించారు. సంస్థ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సభ్యులు జీపీ మల్లికార్జునరావు, ఏజీఎం అన్వేష్‌కుమార్, పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ గోపీనాథ్, పాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



చిన్నారి తల్లికి రూ.10 లక్షల చెక్కును అందిస్తున్న కిన్నెర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంఠంనేని రాజగోపాల్

చిన్నారి వైద్యానికి రూ.10 లక్షల సాయం

చల్లపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పుట్టుకతో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఉయ్యూరుకు చెందిన ఐదేళ్ల చిన్నారి హేశ్వితను ఆదుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంఠంనేని రాజగోపాల్-కృష్ణ దంపతులు రూ.10లక్షలు అందించి దాతృత్వం చాటుకున్నారు. చిన్నారి వైద్యఖర్చులకు రూ.25 లక్షలు అవసరం కాగా, రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ సహాయం రూ.10లక్షలు మంజూరు చేసింది. మరో రూ.15లక్షలు అవసరం ఉండడంతో చిన్నారి తల్లి వక్కలగడ్డ కమలానెహ్రూ మహిళా మండలిని ఆశ్రయించింది. సభ్యురాలు హనుమానుల రాణీకుమారి తమబంధు వర్గ గ్రూపులో విషయాన్ని పోస్టుచేశారు. విదేశాల్లో ఉన్న బంధువులు, కిన్నెర ఫౌండేషన్ ద్వారా సేకరించిన రూ.10లక్షల చెక్కును చిన్నారి తల్లికి అందజేశారు. కిన్నెర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజగోపాల్, కమలా నెహ్రూ మహిళా మండలి సభ్యురాలు రాణీకుమారిని విజయవాడకు చెందిన సప్తా ఫౌండేషన్ చైర్మన్ శరత్‌బాబు, ఐఎంఏ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్, సర్పంచ్ వల్లూరు ఉమా, హనుమానుల సురేంద్రనాథ్‌బెనర్జీ, మల్లుపెద్ది బోసు, పాలడుగు రత్నబాబు, మల్లుపెద్ది రత్నకుమారి తదితరులు అభినందించారు.

నందిగామను అభివృద్ధి చేయండి

- చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారితో మాజీ మంత్రి దేవినేని ఉమా



నందిగామ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారిని అభినందిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో నందిగామ అభివృద్ధికి దూరమైంది. అంకిత భావంతో పనిచేసి, పట్టణాన్ని అభివృద్ధి చేయండి.' అని నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మండవ కృష్ణకుమారికి మాజీ మంత్రి దేవినేని ఉమామాహేశ్వరరావు సూచించారు. బుధవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణకుమారిని దేవినేని ఉమా అభినందించారు. టీడీపీ నాయకుడు మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



తాతినేని వెంకటేశ్వరరావు (ఫైల్)

పమిడిముక్కల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురానికి చెందిన నూట ఐదు సంవత్సరాల తాతినేని వెంకటేశ్వరరావు (జగ్గయ్య) మంగళవారం రాత్రి మృతి చెందారు. వయోధిక, అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సంతానం. మృతదేహానికి గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.





సంగమ ప్రదేశంలో ఆంక్షలు విధిస్తున్నట్టు అధికారులు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక

కోతకు గురవుతున్న కృష్ణవేణమ్మ పాదుకలు

సంగమ స్నానం.. ఆంక్షలు ఘోరం!

ఐదేళ్ల నుంచి కృష్ణా సాగర సంగమ ప్రాంతంలో స్నానాలు నిలిపివేత

- భద్రతను బూచిగా చూపిన అధికారులు
- సంగమ స్నానం సర్వపాపహరణమని నమ్మిక
- భద్రతా ఏర్పాట్లు చేసి అనుమతించాలంటున్న భక్తులు

జీవితంలో ఒక్కసారైనా కృష్ణా సాగర సంగమ క్షేత్రంలో మానవుడు పుణ్యస్నానం ఆచరిస్తే సర్వపాపాలు తొలుగుతాయని స్కంద పురాణం చెబుతోంది. గంగానది తన పాప పంకిలాన్ని పోగొట్టుకునేందుకు కాకిరూపంలో వివిధ పుణ్యనదుల్లో స్నానమాచరిస్తూ వచ్చి, హంసలదీవి క్షేత్రంలోని సాగర సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించిందని, వెంటనే హంసగా మారిందని స్థల పురాణం చెబుతోంది. అంతటి ప్రసిద్ధిగాంచిన కృష్ణా సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానం ఆచరించాలని భక్తులు కోరుకుంటారు. కానీ, ఐదేళ్లుగా భక్తులను పవిత్ర సంగమం వద్దకు వెళ్లకుండా భద్రత పేరుతో అధికారులు ఆంక్షలు విధించారు.

(ఆంధ్రజ్యోతి-కోడూరు): కృష్ణా సాగర సంగమ ప్రదేశం లోతు ఎక్కువ ఉంటుందని, ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, భద్రతా కారణాలు చూపి ఐదేళ్ల నుంచి భక్తులు ఆ ప్రదేశానికి వెళ్లకుండా, స్నానాలు ఆచరించకుండా అధికారులు ఆంక్షలు విధించారు. దీంతో భక్తుల సౌకర్యార్థం సంగమ ప్రదేశంలో నిర్మించిన రెండంతస్తుల వసతి భవనం, దేవుళ్ల విగ్రహాలు, శిథిలావస్థకు చేరాయి. కృష్ణవేణమ్మ పాదాలు కోతకు గురవుతున్నాయి. సంగమ ప్రదేశంలో లోతు ఉంటుందని అందరికీ తెలిసిందేనని సరైన భద్రతా చర్యలు చేపట్టలేక, అధికారులు పవిత్ర సంగమానికి భక్తులు దూరం చేసి, క్షేత్ర వైభవాన్ని కాలగర్భంలో కలిపేస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విజయవంతంగా కృష్ణా పుష్కరాల నిర్వహణ

2016లో కృష్ణా పుష్కరాలను 12 రోజులపాటు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్పటి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారని, అప్పుడు ఒక్క ప్రమాదమైనా జరగలేదని భక్తులు అంటున్నారు. అధికారులు ప్రస్తుతం భద్రత పేరుతో స్నానాలు నిలిపివేయడం సరికాదంటున్నారు.

మాఘ శుద్ధ పౌర్ణమికి లక్షలాది భక్తుల రాక

ఫిబ్రవరి 12వ తేదీన మాఘ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు సంగమ ప్రదేశంలో స్నానమాచరించినందుకు హంసలదీవి వస్తారు. సంగమ ప్రదేశం వద్ద కొత్తగా అభివృద్ధి చేయకపోయినా ఉన్న విశ్రాంతి భవనం, దేవుళ్ల విగ్రహాలు శిథిలం అవ్వకుండా కనీస మరమ్మతులైనా చేయడం లేదని, ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో పూర్తిగా శిథిలమై కనుమరుగవుతుందని భక్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



సంగమ ప్రదేశంలో శిథిలావస్థకు చేరిన రెండంతస్తుల భవనం

భక్తుల మనోభావాలను గౌరవించాలి

భక్తుల మనోభావాలను గౌరవిస్తూ సంగమ ప్రదేశ విశిష్టతను గుర్తించాలని, అన్ని ఏర్పాట్లు చేయాలని అందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో స్వాతి తదితర అధికారులు సహకరించాలని భక్తులు కోరుతున్నారు. మహిమాన్విత సాగర సంగమ క్షేత్రంలో స్నానాలు చేసేవారి భద్రత కోసం ఏర్పాట్లు చేయాలని, శాశ్వతమైన చర్యలు చేపట్టాలని, సంగమ ప్రదేశానికి గత వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్సై శ్రీనివాస్, పీడీఎస్ డీటీ ప్రధాన్

26 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామిక వాడ నుంచి బుధవారం రెండు లారీల్లో 600 బ్యాగుల్లో తరలిస్తున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, గన్నవరం, పీడీఎస్ డీటీ ప్రధాన్ తెలిపారు. బాపులపాడు, నూజివీడు, అగిరిపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో సేకరించిన బియ్యం మల్లవల్లి వద్ద తోటల్లో భద్రపరుస్తున్నారని, దానిని కోళ్ల ఫారాలకు, చేపల మేతకు వినియోగించే పిల్లెట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీలో వినియోగించేందుకు రాజమండ్రికి చెందిన శ్రీనుబాబు తరలిస్తున్నాడని వారు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న 26 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానికంగా ఉన్న రైస్ మిల్లులో ఉంచి, వాహనాలను వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని ప్రధాన్ తెలిపారు. పీడీఎస్ డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

నేషనల్ లెజిస్లేటివ్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర పుణెలోని ఎంఐటీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే నేషనల్ లెజిస్లేటివ్ కాన్ఫరెన్స్‌కు తాను హాజరవుతున్నానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం తెలిపారు. దేశం మొత్తం మీద 300 మంది శాసనసభ్యులు, నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఆయన తెలిపారు. తాను నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండనని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి వసంతోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం స్వామికి వసంతోత్సవం, అవభృదస్నానోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, బలిహరణను అర్చకబృందం శాస్త్రోక్తంగా జరిపింది. స్వామి, అమ్మవార్లకు పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, వసంతోత్సవం నిర్వహించారు. వేదపండితులు మహాపూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపించారు.



పంచామృతాభిషేకాలను ప్రారంభిస్తున్న ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు



పాలకావడులతో ఆలయానికి చేరుకున్న మాలధారులు

సుబ్రహ్మణ్యస్వామి దీక్షల విరమణ

45రోజులపాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాల ధరించి దీక్ష చేసిన స్వాములు బుధవారం ఆలయంలో దీక్షలు విరమించారు. స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా మోపిదేవి పురవీధుల్లో భజాన పాలకావిడులతో గ్రామోత్సవం చేశాక, దీక్ష విరమించారు.

ఆక్రమిత భూమి రామలింగేశ్వస్వామి ఆలయానిదే

- సర్వే చేసి నిర్ధారించిన అధికారులు



ఆక్రమణలో ఉన్న భూమిని సర్వే చేస్తున్న అధికారులు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురైన నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయ భూమిని బుధవారం అధికారులు సర్వే చేసి, అది ఆలయానిదే అని నిర్ధారించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డు పక్కన గల సర్వే నెంబర్ 822లోని ఆలయ భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దేవదాయశాఖ అధికారులు స్పందించారు. ఆ స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి తమదేనని, తమ వద్ద పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయంటూ వ్యాపారులు మంగళవారం బోర్డును పీకేశారు. దీంతో భక్తులకు, వ్యాపారులకు మధ్య వివాదం చెలరేగింది. వెంటనే సర్వే చేయాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదేశించారు. దీంతో రెవెన్యూ, దేవదాయ, ఆర్ అండ్‌బీ అధికారుల సమక్షంలో సర్వే చేశారు. భూమి పూర్తిగా ఆలయానికి చెందినదని తేలింది. దీంతో పాటు సమీపంలోని ఒక బహుళ అంతస్థు భవనం పూర్తిగా, మరొక భవనంలో కొంత భాగం ఆలయానికి చెందిన భూమేనని తేలింది. భవనం క్రింద ఆక్రమణలో ఉన్న భూ మిని కొంత మంది దేవదాయశాఖ సిబ్బంది అక్రమంగా వారికి కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. దేవదాయ అధికారులు దర్యాప్తు చేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గత నెల మొదటి వారంలో కంచికచర్ల మండలంలో మంత్రి లోకేశ్ పర్యటన ఉందని కంచికచర్ల నుంచి చెవిటికల్లు, కీసర నుంచి మోగులూరు మీదుగా దొనబండ వెళ్లే రోడ్ల మరమ్మతులు ప్రారంభించిన అధికారులు ఆ తర్వాత మంత్రి పర్యటన రద్దవడంతో పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు, రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.



కంచికచర్ల- చెవిటికల్లు రోడ్డు..



చెవిటికల్లు, కునికినపాడు గ్రామాల మధ్య దొనబండ - కీసర వెళ్లే రోడ్డు..

అసంపూర్తిగా.. రోడ్ల మరమ్మతులు

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల): కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, కీసర నుంచి మోగులూరు మీదుగా దొనబండ వెళ్లే రోడ్డు దెబ్బతిని, వాటిపై తారు పోయి, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. గత నెల మొదటి వారంలో కంచికచర్ల మండలంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల పర్యటన రద్దయింది. మంత్రి లోకేశ్ పర్యటనను దృష్టిలో పెట్టుకుని నెల క్రితం ఈ రోడ్లను బాగు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ప్యాచ్ వర్కుల మాదిరిగా గుంతల వద్ద, మెతగ్గా ఉన్న చోట్ల రోడ్లను తవ్వారు. కొన్ని ప్యాచ్‌లకు తారు వేసిన అధికారులు, మిగతా ప్యాచ్‌లకు తారు వేయకుండా వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

మిర్చితోట దెబ్బతింటోందని లారీల నిలిపివేత

ఇసుక లారీల వల్ల విపరీతమైన దుమ్ము, ధూళి లేస్తోంది. రోడ్డు పక్కన ఉన్న మిర్చి, మొక్కజొన్న తోటలపై దుమ్ము పడుతోంది. దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నెలయినా రోడ్డును బాగు చేయకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము వల్ల మిర్చి తోట దెబ్బతింటోదని బుధవారం ఒక రైతు రోడ్డుపై ఇసుక లారీలను నిలిపివేశారు. రోడ్లను బాగుచేయాలని ప్రజలుకోరుతున్నారు.

త్వరలో బాగుచేస్తాం

నిధుల కొరత ఉంది. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వీలైనంత త్వరలో రోడ్లను బాగు చేస్తాం.

- శశిభూషణ్, ఆర్అండ్‌బీ జేఈ

శబ్దంలేకుండా కారు అద్దం పగులకొట్టి రూ.3 లక్షలు చోరీ

(5వ పేజీ తరువాయి)

మచిలీపట్నంలో బుధవారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే... మచిలీపట్నం కొబ్బరితోటకు చెందిన చలమలశెట్టి సుధాకర్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ బేగంపేటలో నివాసం ఉంటున్నారు. మచిలీపట్నం మాచవరం ప్రాంతంలో తనకు చెందిన 300 గజాల స్థలాన్ని మచిలీపట్నానికి చెందిన పెదసింగు నాగేశ్వరరావుకు విక్రయించారు. ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు బుధవారం సుధాకర్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కారులో వచ్చారు. కారుకు తాళాలు వేసి రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లారు. వీరి కారును, అందులోని వ్యక్తుల కదలికలను పూర్తి స్థాయిలో గమనిస్తున్న ఇద్దరు వ్యక్తులు రెడ్‌కలర్ పల్సర్ వాహనంపై రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. కారులో వచ్చిన వారు కారు దిగి రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లే వరకు వేచిచూశారు. ఆ తర్వాత కారు అద్దానికి కెమికల్ ముద్దను అతికించి శబ్దం రాకుండా పగులకొట్టారు. కారులో ఉన్న రూ.3 లక్షల నగదును తీసుకుని పరారయ్యారు. అయితే కారులో ఉన్న ల్యాప్‌టాప్‌ను వదిలేశారు. కారు అద్దాలు పగలుకొట్టి అందులోని నగదును దొంగిలించిన వారి కదలికలపై పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలన చేస్తున్నారు.

'రసాయనాల' కథ నడిపిందెవరు?

(5వ పేజీ తరువాయి)

ట్యాంకర్‌లో ఎంత మొత్తంలో ఎలాంటి వ్యర్థాలను పీపీయూకు పంపుతున్నారో కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించిన అధికారులు ఆన్‌లైన్‌లో అనుమతి ఇస్తారు. ఆ అనుమతి కాగితాన్ని ఫార్మా కంపెనీ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒక కాపీని పీపీయూకు పంపాలి. ఒక కాపీని డ్రైవర్‌కు ఇవ్వాలి.

అనుమతి పత్రాన్ని మాయచేసి మరీ..

పీసీబీ అధికారులు ఆన్‌లైన్‌లో ఇచ్చే అనుమతి కాగితాన్ని మాయ చేసినట్టు అధికారులు గుర్తించారు. జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లో పారబోసినవి రసాయన వ్యర్థాలు కాదని, వ్యర్థ నీరని చెబుతున్నారు. ఈ ట్యాంకర్ డ్రైవర్ వద్ద అనుమతి కాగితాలను పరిశీలించిన పీసీబీ అధికారులు వాటిపై జగ్గయ్యపేటలోని పీపీయూకు వెళ్తున్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లి విచారించగా ఇలాంటి ట్యాంకర్ వస్తుందని తమకు ఎలాంటి సమాచారం రాలేదని, పీసీబీ ఇచ్చే అనుమతి కాగితం అందజేయలేదని సిబ్బంది చెప్పారు. దీనితో డ్రైవర్ వద్ద ఉన్నది నకిలీ అనుమతి కాగితమని గుర్తించారు. ఇదే విషయాన్ని వైజాగ్‌లోని పీసీబీ అధికారులకు తెలియజేశారు. అక్కడ క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీలో అక్కడి అధికారులు విచారణ చేస్తున్నారు.

ట్యాంకర్‌కు రెండు నంబర్లు

సాధారణంగా పెద్దపెద్ద కంటైనర్లు, ట్యాంకర్లకు ఒకటే రిజిస్ట్రేషన్ నంబరు ఉంటుంది. వాహనం ముందు, వెనుక నంబరు ప్లేట్లు ఉంటాయి. ఈ రెండు కాకుండా ట్యాంకర్లపై యజమాని పేరు, దాని రిజిస్ట్రేషన్ నంబరు ఉంటాయి. వ్యర్థాలతో వచ్చిన ట్యాంకర్‌కు వేర్వేరు నంబర్లు ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. నంబరు ప్లేట్‌పై ఏపీ02 టీబీ 6606 ఉంది. ట్యాంకర్‌పై మాత్రం యజమాని కె.రమణారెడ్డి అని, రిజిస్ట్రేషన్ నంబరు ఏపీ21 టీవై 3499 అని ఉంది. రిజిస్ట్రేషన్ నంబర్లలో ఈ వ్యత్యాసం ఉండడం అనుమానం కలిగిస్తోంది. ఫార్మా కంపెనీల నుంచి వ్యర్థాలను తీసుకెళ్లే ట్యాంకర్లకు కచ్చితం జీపీఎస్ పరికరం ఉండాలని పీసీబీ ఆదేశాలు ఇచ్చింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్యాంకర్‌కు జీపీఎస్ పరికరం లేదని పీసీబీ అధికారులు గుర్తించారు. ప్రమాదకర వ్యర్థాలను తరలించే ట్యాంకర్లపై పెద్దపెద్ద అక్షరాలతో హజార్డస్ అని రాసి ఉంటుంది. ఈ ట్యాంకర్లు నీలం, తెలుపు రంగులో ఉంటాయి. పోలీసులు సీజ్ చేసిన ట్యాంకర్‌పై తెలుపు, నీలం రంగులు ఉన్నప్పటికీ హజార్డస్ అనే పదం మాత్రం ఎక్కడా కనిపించలేదు. జక్కంపూడిలోని పారబోసిన వ్యర్థాలు ఉన్న భూముల నుంచి అధికారులు నమూనాలను సేకరించారు. వాటిని వైజాగ్‌లోని కాలుష్య నియంత్రణ మండలి జోనల్ ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపారు.

అటు నుంచి ఇటు..!

(5వ పేజీ తరువాయి)

పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, అమరావతి, వడ్డమాను, తాడికొండ, కొప్పవరం, నంబూరు రైల్వేస్టేషన్ వరకు అమరావతి రైల్వేలైన్‌ను ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టును చేపట్టడానికి కిందటి ఏడాది సెప్టెంబరులోనే రూ.2,545 కోట్లతో అనుమతులు ఇచ్చారు. ఈ రైల్వే ప్రాజెక్టు రాజధానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. అమరావతిలో నూతన రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉండటం తగదన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. విజయవాడ చెంతనే ఉన్న కొండపల్లి.. సికింద్రాబాద్ డివిజన్‌లో ఉండి, ఎక్కడో విశాఖలో ఉండే దువ్వాడ విజయవాడ డివిజన్ పరిధిలో ఉండటం కూడా విమర్శలకు తావిస్తోంది. ఈ పరిస్థితిలో సికింద్రాబాద్ డివిజన్‌లోని 65 కిలోమీటర్ల రూట్ లెంగ్త్‌ను విజయవాడ రైల్వే డివిజన్‌లో విలీనం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం



గన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు అన్నారు. మండలంలోని గొల్లనపల్లి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం తల్లి పేరుతో ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటాలని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలోని గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నుంచి పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌ఎం కెఎస్ జగదీశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి డి.అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దందాకు చెక్

- రామవరప్పాడు సెంటర్ నుంచి చెక్‌పోస్ట్ సెంటర్ వరకు వైసీపీ నేత కనుసన్నల్లో రోడ్డును ఆక్రమించేసిన నాయకులు
- టీడీపీ గ్రామ నాయకుల కృషి.. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీతో సర్వీసు రోడ్డు ఏర్పాటుకు అడ్డంకుల తొలగింపు
- ఊపిరిపీల్చుకున్న రామవరప్పాడు గ్రామస్తులు



రైవస్ కాల్వకట్ట వెంబడి తొలగిస్తున్న అడ్డంకులు.. నేలమట్టమైన ముఠా కార్మికుల భవనం (ఇన్‌సెట్లో)

గుణదల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడులో వైసీపీ హయాంలో ఓ నాయకుడు కనుసన్నల్లో రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు నలుగురికి అధికారికంగా ఆక్రమించుకునేందుకు అనుమతులు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఇందులో ఒకరు కృష్ణుడి గుడి, మరొకరు అయ్యప్పస్వామి ఆలయం, మరొకరు రైతుబజార్, ఇంకొకరేమో ఏకంగా ముఠాకార్మికుల కార్యాలయం అంటూ ఎవరికి వారు భూమిపూజలు అట్టహాసంగా చేసుకుని వారి సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తరువాయిగా గ్రామస్తులు ప్రధానంగా వాహనాల రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ రామవరప్పాడు అధ్యక్షుడు నబిగాని కొండ, పార్టీ విజయవాడ రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కొల్లా ఆనంద్‌లు విషయాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వివరించారు. దీంతో ఆయన గ్రామస్తుల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే నాల్గురోజులనుంచి పనులు ప్రారంభం అయ్యాయి. రైతుబజార్ నిర్మాణానికి గాను ఏర్పాటు చేసిన పిల్లర్లను మంగళవారం తొలగించారు. అదే సమయంలో ముఠాకార్మికుల కార్యాలయాన్ని నేలమట్టం చేయడం జరిగింది. రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు రైవస్ కాల్వకట్ట వెంబడి సర్వీసు ఏర్పాటు చేయడానికి ఉన్న అడ్డంకులను ఒక్కొక్కటిగా బుధవారం జేసీబీతో తొలగించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయినట్లే..

సర్వీసు రోడ్డు ఏర్పాటు జరిగితే రామవరప్పాడు మూడు కాల్వకట్లమీద నివాసాలు ఉండేవారికి ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయినట్లేనని నబిగాని కొండ అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అటు ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ విషయమై రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ నిశాంత్‌కుమార్

రికార్డుల పరిశీలన

ఉయ్యూరు. ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయాన్ని ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ బుధవారం సందర్శించారు. గీత కార్మిక కుటుంబాలకు మద్యం షాపులకు సంబంధించి సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో వచ్చిన వాటికి సంబంధించి రికార్డులను ఈసందర్భంగా పరిశీలించారు. దరఖాస్తులు ఇతర వివరాలను సీఐ శేషగిరిరావు ఆయనకు వివరించారు. గీత కార్మికులకు మద్యం షాపుల దరఖాస్తులు, తదితర అంశాలపై కమిషనర్ పలు సూచనలు చేశారు.

నేటి నుంచి దంత వైద్యశిబిరం

గన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఉచిత దంత వైద్య శిబిరం గురువారం నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ నోరు, ముఖను, దవడ ఎముకల శస్త్ర చికిత్స విభాగం వారోత్సవాల్లో భాగంగా ఆ విభాగం ఆధ్వర్యంలో రూమ్ నెంబర్ 2లో దంత వైద్య సేవలు అందిస్తారన్నారు. అన్ని విభాగాల్లో శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తారని, శిబిరం 15వ తేదీ వరకు ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

ఉంగుటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆ వ్యసనాన్ని మానుకోలేక మనస్తాపంతో ఎలుకల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మానికొండలో చోటుచేసుకుంది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మునీర్(25)తాపీ మేస్త్రీగా పనిచేస్తూ మద్యానికి అలవాటుపడ్డాడు. గతనెల 31 ఎలుకల మందు తిన్నాడు. వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కృష్ణనాయక్‌కు సత్కారం

ఉయ్యూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి కృష్ణనాయక్‌ను విద్యుత్ ఉద్యోగులు బుధవారం ఘనంగా సత్కరించారు. డివిజన్ స్థాయిలో ఉత్తమ అధికారిగా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా గండిగుంట లైన్‌మేన్ ఎం సుబ్రమణ్యం, షిఫ్ట్ ఆపరేటర్లు జగదీశ్, ఆంజనేయులు, విజయప్రసాద్ సత్కరించి అభినందనలు తెలిపారు.

అందుబాటులో గుండెకు భరోసా వైద్యసేవలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) :ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు ప్రథమ చికిత్సకు అవసరమైన ఇంజక్షన్ అందుబాటులో ఉన్నట్టు వైద్యశాల సూపరింటెండెంట్ మురళీ తెలిపారు. వైద్యశాల ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుండెనొప్పి అని అనుమానం వచ్చిన వెంటనే వైద్యశాలకు వస్తే ఈసీజీ ఇతర పరీక్షలు చేసి గుండె నొప్పిగా నిర్ధారణ అయితే ప్రథమ చికిత్సగా ఇంజక్షన్ చేసి విజయవాడ గుండె వైద్యుల దగ్గరకు పంపుతామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ తెలిపారు.



విద్యార్థుల మధ్య మాజీ ఎంపీ మాగంటి బాబు జన్మదిన వేడుక

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

మాజీ ఎంపీ మాగంటి బాబు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను మానవత్వంతో ఆదుకొని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉండాలని మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగుల మధ్య మాగంటి తన 65వ జన్మదిన వేడుకను కుటుంబ సభ్యులతో జరుపుకున్నారు. పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మాగంటి బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఇటీవల ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థుల అవసరార్థం రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల టీడీపీ నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, వడ్డి వాసవీ, స్థానిక లయన్స్ క్లబ్ నాయకులు నందిగం స్వామి, పాఠశాల నిర్వాహకులు మాధవీలత, మరీదు వెంకటస్వామి తదితరులు మాగంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

గుణదల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘం పిలుపు మేరకు రామవరప్పాడు పంచాయతీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గత కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి లేబర్ కోడ్స్‌గా రూపొందించమంటే చట్టాలను తుంగలో తొక్కడమేనని విమర్శించారు. పోరాడి సాధించుకున్న హక్కులు, ఉన్న చట్టాలు నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కనీసం కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడా చర్చిం చలేదని మండిపడ్డారు. లేబర్ కోడ్స్‌ని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ విజయవాడ రూరల్ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు

ఉంగుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1నుంచి 19సంవత్సరాల లోపు పిల్లల్లో సామూహిక నులిపురుగుల నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో),సూపరింటెండెంట్ జీవీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. ఇందుపల్లి, ఉంగుటూరు, పెదఅవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీలకు ప్రభుత్వం సరఫరాచేసిన సుమారు 7450 ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను బుధవారం ఆయా ఆసుపత్రుల హెల్త్ సూపర్‌వైజర్లకు స్థానిక మండల రిసోర్స్ కార్యాలయంలో ఏవో ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు అంకూరి నాగమల్లేశ్వరరావు, టి.సాల్మన్‌రాజు, ఎంపీహెచ్ఈవో కేవీవీ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ బి.రత్నశేఖర్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ఉద్ధగిరి శ్రీనివాస్ (శ్రీరామ్), తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ఉయ్యూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ సీఈసీ, ఎంఈసీ గ్రూపుల విద్యార్థులకు బుధవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ కళాశాలలకు చెందిన 140మంది విద్యార్థులు టా లెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాలకు చెందిన గుణ చైతన్య ప్రథమ, ఇదే కళాశాలకు చెందిన శాంతి, ఆంధ్రా జూనియర్ కళాశాలకు చెందిన సూర్యచరణ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఫర్హానాబేగం, పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సూర్యచందు తృతీయ స్థానాలు సాధించారు. విశ్రాంత అధ్యాపకులు కె చంద్రశేఖర్‌రావు, ఎం రాఘవేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వసంతరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

గన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహం రైతుల ఆందోళనకు దారి తీసింది. జాతీయ రహదారిపై బైఠాయించి కొద్ది సేపు రైతులు ఆందోళన చేశారు. స్థానికుల వివరాల మేరకు ఉంగుటూరు మండలం నుంచి వరిగడ్డి లోడుతో మూడు ట్రాక్టర్‌లు గన్నవరం మీదుగా మర్లపాలెం వెళుతున్నాయి. వెంకటేశ్వర థియేటర్ వద్దకు రాగానే ట్రాఫిక్ పోలీసులు అడ్డుకుని ట్రాక్టర్‌లను ఫొటోలు తీశారు. ట్రాఫిక్ పోలీసుల తీరుపై డ్రైవర్‌లు, రైతులు, కూలీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న మర్లపాలెంకు చెందిన రైతులు కూడా అక్కడకు చేరుకని డ్రైవర్‌లకు మద్దతుగా జాతీయ రహదారిపై బైఠాయించటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. కొద్దిసేపటికి పోలీసు అధికారులు వచ్చి సర్ది చెప్పటంతో రైతులు ఆందోళన విరమించారు.

వితరణశీలి తిపిరినేని వేణుగోపాలరావు మృతి



వేణుగోపాలరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కాకులపాడు గ్రామాభివృద్ధికి వితరణ చేసిన తిపిరినేని వెంకట కనక వేణు గోపాలరావు(85) అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన గ్రామానికి అవసరమైన సహకార సంఘ గోడౌన్‌కు 14సెంట్ల విలువైన స్థలాన్ని వితరణ చేశారు. మానవత సంస్థ సేవలను విస్తృతం చేయడానికి రూ.50వేలు విరాళం అందజేశారు. గుడివాడ ఎల్ఐసీలో పనిచేసి రిటైర్ అయిన వేణుగోపాలరావు విశాఖపట్నంలోని కుమార్తె ఇంటిలో తుదిశ్వాస విడిచారు.

ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద మృతి



కేసీపీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న సురేంద్రబాబు బంధువులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేసీపీ చక్కెర కర్మాగారానికి ట్రాక్టరుతో చెరకు తీసుకువచ్చి యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం తెలవారు జామున జరిగింది. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. మానికొండ గ్రామానికి చెందిన మన్నే సురేంద్రబాబు (21) మంగళవారం రాత్రి కేసీపీ కర్మాగారానికి మానికొండ నుంచి సొంత ట్రాక్టరుపై చెరకు తీసుకువచ్చి కర్మాగార బళ్లదొడ్డిలో సీరియల్‌లో ఉంచి తోటి డ్రైవర్లతో కలసి నిద్రించాడు. మరి కొద్దిసేపటికి సురేంద్రబాబు సీరియల్ రాగా నిద్రలేచి మూత్ర విసర్జనకు వెళ్లి తిరిగి ట్రాక్టరు వద్దకు వస్తూ పడిపోయాడు. అక్కడ ఉన్న డ్రైవర్లు 108లో ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయింపు

సురేంద్రబాబు దిమ్మపై పడి దెబ్బతగిలి చనిపోలేదని, ఎవరో కొట్టి చంపి ఉంటారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు బుధవారం మధ్యాహ్నం కేసీపీ కర్మగారం గేటు ఎదుట ఆందోళనకు దిగి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కంకిపాడు, పెనమలూరు సీఐలు మురళీకృష్ణ, వెంకటరమణ, పట్టణ ఎస్సై విశ్వనాథ్ కేసీపీ అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పడకల శ్రీనివాసరావు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద నుంచి ఆర్బీకేల (రైతు సేవా కేంద్రాల) ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పడకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాపులపాడు మండలంలోని కాకులపాడులో గల తన వ్యవసాయ భూమిలో నిలువ ఉన్న ధాన్యపు రాశులను ఆయన బుధవారం చూపించారు. గత సెప్టెం బరులో వచ్చిన తుపాను వల్ల ఆరుగొలను, రంగయ్యప్పారావుపేట, కానుమోలు, దంటగుంట్ల, కాకులపాడు తదితర గ్రామాల్లో వరి సాగు ఆలస్యంగా చేయడం జరిగిందని అందు వల్ల పటం చేతికి వచ్చేందుకు ఆలస్యమైందన్నారు.



108 కలశాలతో శోభాయమాన యాత్రలో భక్తులు

మడిచర్లలో వైభవంగా కలశపూజ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మడిచర్లలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ప్రతిష్ఠామహోత్సవ పూజలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మడిచర్ల గ్రామదేవతలకు పసుపు, కుంకుమ సమర్పించి 108 కలశాలను తలనిడి మహిళలు బుధవారం గ్రామప్రదక్షిణ, శోభాయమానయాత్ర నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. తదనంతరం ఫిబ్రవరి 7న శుక్రవారం నిర్వహించే ప్రతిష్ఠామహోత్సవంలో భాగంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారికి అర్చకులు వేమూరి బాలసుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో ఏడిద రామకృష్ణశాస్త్రి, అనిపెద్ది మునిశర్మ పర్యవేక్షణలో గోపూజ, కలశపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన నిర్వహించారు.

ముగిసిన ఎడ్యుకేషన్ ఫెయిర్



నమూనాలను పరిశీలిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

గన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో గత రెండు రోజులుగా ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ ఫెయిర్ బుధవారంతో ముగిసింది. విద్యార్థులు తయారు చేసిన తాజ్‌మహల్, నెయిల్ బెడ్, అయోధ్య రామమందిరం, మక్కా, చర్చి, వాటర్ సైకిల్, నెయిల్ బెడ్, మ్యూజిక్ కాయిన్ బాక్స్, సీజన్స్, న్యూటన్స్ క్రాడిల్, వీధిలైటు, యాసిడ్ రైన్స్, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, ఎర్త్ గ్రావిటీ, డ్రిప్ ఇరిగేషన్ వంటి ప్రాజెక్టులు అందరిని ఆకట్టుకున్నాయి. లయన్స్ జిల్లా 316డి నాయకులు లయన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుమాటి చెన్నయ్య, సుధాకర్ వెల్ఫేర్ అసిస్టెంట్ జె.నానారావు, పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్ వ్యవహారాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్ జయరాజు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో అన్ని రిజిస్ట్రేషన్ల వ్యవహారాలు పారదర్శకంగా కృషి చేస్తామని కానుమోలు సబ్‌రిజిస్ట్రార్ డి.జయరాజు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని స్టాంప్ వెండర్లు, స్టాంప్ రైటర్లు, కార్యాలయం సిబ్బంది రిజిస్ట్రేషన్ల వ్యవహారాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో రిజిస్ట్రార్ జయరాజు స్టాంప్ వెండర్లు, రైటర్లు, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు గుండపనేని ఉమావరప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమణ



రామవరప్పాడు జంక్షన్ వద్ద..



సెంటినీ హాస్పిటల్ సర్వీస్ రోడ్...



నగరంలో ఎక్కడ చూసినా.. ఆక్రమణలే.. చిన్న జాగా కనిపిస్తే చాలు అక్కడ టెంట్ వేసి ఆక్రమిం చేస్తున్నారు. ఇలాంటి వాటిపై దృష్టి సారిం చాల్సి న అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహ రిస్తున్నారు. నగరంలో ప్రధాన సెంటర్లలో ఒకటైన రామవరప్పాడు సెంటర్‌లో కార్ల స్టాండ్ పేరుతో టెంట్ వేసేశారు. బారులు తీరిన కార్లతో రోడ్డు మూసుకుపోయింది. వెడల్పాటి రోడ్డు సైతం చిన్న సందులా మారింది. అంతేకాక బెంజిసర్కిల్ నిర్మలా కాన్వెంట్, సెంటినీ హాస్పిటల్ వద్ద సర్వీస్ రోడ్లపై వాహనాలు అనధికారికంగా పార్కింగ్ చేస్తుండటంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇలా సర్వీస్ రోడ్లపై పార్కింగ్ చేసే విధానాన్ని నియంత్రించాలి.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ



ప్రభుత్వాసుపత్రి సర్వీస్ రోడ్



నిర్మలా కాన్వెంట్ వద్ద సర్వీస్ రోడ్



రాజ్‌నాథ్ సింగ్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న నారా లోకేశ్

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి లోకేశ్

వన్‌టౌన్,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఢిల్లీలో బుధవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు, కేంద్ర భారీ పరిశ్రమ, ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు గంటి హరీష్ మాధుర్, బస్తిపాటి నాగరాజు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌తో పాటు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత పాలకుల అనాలోచిత విధానాలతో లక్షల కోట్ల అప్పుల్లో మునిగిన ఏపీకి అండగా ఉంటూ, రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు మంత్రికి శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

రూ. 36లక్షల విలువైన
310 మొబైల్స్ రికవరీ

- బాధితులకు అప్పగించామన్న ఎస్పీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ సందర్భాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు చెందిన 310 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 36లక్షల విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. మొత్తంగా ఇప్పటి వరకు రూ.90 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్టు ఎస్పీ తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు తమ ఇంటి వద్ద నుంచి ఎంఎం టీఎస్ సర్వీస్ ద్వారా 9490617573 వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ చేసి ఫోను వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేసుకున్న వారి ఫోన్లను రికవరీ చేసి ఇస్తున్నామన్నారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై దర్యాప్తు

వన్‌టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు కొత్తపేట సీఐ చినకొండల రావు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. వన్‌టౌన్‌లో పలువురు ముఠాగా ఏర్పడి వివిధ వర్సిటీల నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 20 మందికి పైగా ఆ ముఠాలో సభ్యులు చెప్పిన మాయమాటలు నమ్మి డబ్బులు చెల్లించారు. సర్టిఫికెట్ల కోసం బాధితులు అడుగుతున్నప్పటికీ ముఠా సభ్యులు కాలయాపన చేస్తున్నారు. కొందరు బాధితులు గట్టిగా ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారంపై మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ నకిలీ సర్టిఫికెట్లలో కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల పేరిట డిగ్రీ సర్టిఫికెట్ కూడా ఉండటంతో సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చినకొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ముఠాలోని సభ్యులను గుర్తించినట్టు సమాచారం.

డబ్బులు తిరిగిచ్చేయండి: బాధితులు

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాలో మోసపోయిన బాధితులు తామిచ్చిన డబ్బులు తిరిగిచ్చేయమని ముఠా సభ్యులను కోరుతున్నారు. అయితే ఆ ముఠాలోని పలువురు సభ్యులు ఎవరికి వారే తమకు సంబంధం లేదంటూ తప్పించుకోవటంతో బాధితులను పోలీసులను ఆశ్రయించటానికి సిద్ధమైనట్టు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- విస్తృత తనిఖీలతో నిరంతర పర్యవేక్షణ
- ప్రజా పంపిణీని పటిష్టంగా అమలు చేయండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ట అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ పాయింట్లను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు తీరుతెన్నులు, చేపట్టాల్సిన తనిఖీలు, ఉల్లంఘనలపై కేసుల నమోదు తదితర అంశాలపై పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. దీనికి కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, పౌరసరఫరాల అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని 957 రేషన్ దుకాణాలను, 7 ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు ప్రతి నెలా 20 దుకాణాలు, తహసీల్దార్లు 5 దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. పౌర సరఫరాల డీఎం, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేయాలన్నారు. 2024 జూలై నుంచి డిసెంబరు వరకు 6ఏ కేసులు 119 నమోదయ్యాయని, ఇకపై క్రియాశీలంగా వ్యవహరిస్తూ చట్టప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణపై కలెక్టర్ పౌరసరఫరాల అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు 16,217 మంది రైతుల నుంచి రూ.254కోట్ల విలువైన 1,09,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, పాల్గొన్నారు.

సీబీఐ కోర్టు స్పెషల్ పీపీగా వెన్నా కళ్యాణ్



విజయవాడ లీగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీబీఐ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెన్నా కళ్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈయన తండ్రి సీనియర్ న్యాయవాది, విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు మాజీ ఏపీపీ వెన్నా రమేష్ చంద్రబాబు. తండ్రి అడుగుజాడల్లోనే ప్రాక్టీసు చేస్తూ తండ్రిని మించిన తనయుడిగా ఏకంగా సీబీఐ కోర్టుకే స్పెషల్ పీపీగా కళ్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. కళ్యాణ్ 2013లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. విజయవాడలోని సీబీఐ కోర్టు, విశాఖ, కర్నూల్‌లోని సీబీఐ కోర్టులకు స్పెషల్ పీపీగా వెన్నా కళ్యాణ్ చక్రవర్తి వ్యవహరిస్తారు. ఈయన నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు వి.గురునాథం, చేకూరి శ్రీపతి, పడవల ఏడుకొండలు, కోట జయరాజు, బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.



డైరీని ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, తదితరులు

గిడ్డంగుల సంస్థ డైరీ ఆవిష్కరణ

ఆటోనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నూతన సంవత్సర డైరీని సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎండీ సురేష్ కుమార్ బుధవారం ఆటోనగర్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గిడ్డంగుల సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీఎం చంద్రశేఖర్, రవికుమార్, జవహర్‌బాబు, మాధవరావు పాల్గొన్నారు.



ఫస్ట్ సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్సిటీ పరిధిలో ఫస్ట్ సెమిష్టర్ స్పాట్ వాల్యుయేషన్ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు, హిందీ, సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించారు. 60 మంది అధ్యాపకులు మొదటి రోజు మూల్యాంకనంలో పాల్గొన్నారు.

జలక్రీడల్లో నాగాయలంక బాలికకు గోల్డ్

- కెనోయింగ్ పోటీల్లో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ సాధించిన నాగిడి గాయత్రి



గాయత్రికి పతకాన్ని అందిస్తున్న నిర్వాహకులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జాతీయ స్థాయిలో జరుగుతున్న జలక్రీడల పోటీల్లో నాగాయలంక బాలిక సత్తా చాటి ప్రథమ స్థానాన్ని సాధించింది. నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి ఆంధ్రప్రదేశ్ తరఫున ఈ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచి బంగారు పతాకాన్ని సాధించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. 2019లో నాగాయలంకలో జలక్రీడల అకాడమీని స్థాపించగా, ఆ అకాడమీలో మొదటి బ్యాచ్‌లో శిక్షణ పొందిన నాగిడి గాయత్రి వైసీపీ హయాంలో అకాడమీ తీసివేసినప్పటికీ స్వయంగా సాధన చేస్తూ పలు జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధిస్తూ వచ్చింది. జాతీయ స్థాయి జలక్రీడల్లో అత్యుత్తమ పోటీల్లో ఒక్కటైన కెనో స్లలోమ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న గాయత్రి అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి బంగారు పతకాన్ని సాధించిందని, ఆంధ్రప్రదేశ్ కాయాకింగ్, కనోయింగ్ అధ్యక్షుడుడు బలరామ్ నాయుడు ఆమెను అభినందించారు. గుంటూరుకు చెందిన కొల్లారి సాయితేజ, చిన్నబాబు ఆమెకు శిక్షకులుగా వ్యవహరించగా, కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆమెకు సహకారం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం కారణంగానే తాను జాతీయ స్థాయిలో పతకాలు సాధించగలిగామని, శిక్షణ కోసం కొన్ని ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంటే దేశం తరఫున అంతర్జాతీయ స్థాయిలో మెడల్ సాధించగలనని గాయత్రి తెలిపారు. తనకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు, ఆది నుంచి తనకు అండగా నిలుస్తున్న వాటర్ స్పోర్ట్స్ కోచ్ శివారెడ్డికి, కాయాకింగ్, కనోయింగ్ అసోసియేషన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నందిగామ చైర్‌పర్సన్ ఎన్నికపై వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నందిగామ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం సమావేశం నిర్వహణను సవాల్ చేస్తూ దాఖలైన వాజ్యాన్ని బుధవారం హైకోర్టు కొట్టివేసింది. వాజ్యం దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు అర్హతలేదని స్పష్టం చేశారు. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత తీర్పు ఇచ్చారు.

నందిగామ మున్సిపాలిటీలో ఖాళీ అయిన రెండు వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఉపఎన్నికలు జరిపిన తరువాతే చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నందిగామ పట్టణానికి చెందిన నాదెండ్ల హారిక హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, నందిగామ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ శిరీష వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

మచిలీపట్నం-ధనపూర్ మధ్య
మహాకుంభ్‌కు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌కు వెళ్లే భక్తుల కోసం విజయవాడ రైల్వే డివిజన్ అదనపు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ మండ్రూప్‌కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-ధనపూర్ మధ్య 07113 నెంబరు రైలు ఉదయం 11 గంటలకు బయలుదేరి మరునాడు రాత్రి 11.55 గంటలకు ధనపూర్ చేరుకుంటుంది. ఈనెల 8,16 తేదీల్లో నడుస్తుంది. 07114 ధనపూర్-మచిలీపట్నం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి మరునాడు వేకువ జామున 3 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 10, 18తేదీల్లో నడుస్తుంది. మచిలీపట్నం, గుడివాడ, విజయవాడ, కొండపల్లి, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల్, బెల్లంపల్లి, సిరిపూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగపూర్, జుజహర్‌పూర్, ఇటార్సీ జంక్షన్, ప్రిపరియా, జబల్‌పూర్, కట్నీ, సత్నా, మాణిక్‌పూర్ జంక్షన్, ప్రయాగ్‌రాజ్ చియోకి, మీర్జాపూర్, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బుక్సర్, ఆరా మీదుగా దనపూర్, ఇదే రూట్‌లో తిరుగు ప్రయాణంలో మచిలీపట్నం చేరుకుంటారు.

ఏపీలోనూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణ నివేదికను తెలంగాణ అసెంబ్లీలో పెట్టడంపై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఎందరో ముఖ్యమంత్రులు చేయలేని సామాజిక న్యాయాన్ని చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా సత్వర చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరారు. జిల్లా యూనిట్ కాకుండా రాష్ట్ర యూనిట్ ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్లు మానికొండ శ్రీధర్‌మాదిగ, పానుగంటి షాలెంరాజ్ మాదిగ, ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ, స్టేట్ లీగల్ కన్వీనర్ చిలుపూరు నాగరాజు మాదిగ పాల్గొన్నారు.



రాళ్లు లేచి ప్రమాదకరంగా మారిన రోడ్డు

వాహనాల రాకపోకలకు రేగుతున్న దుమ్ము

గోతులు తీసి వదిలేశారు..

విజయవాడ రామవరప్పాడు ఫ్లైవోవర్ మీదుగా నగర శివారునున్న ముస్తాబాద్‌కు వెళ్లే రహదారి పూర్తిగా పాడై కంకర బయటికి వచ్చి ప్రమాదకరంగా తయారైంది. ఆగస్టులో బుడమేరుకు వచ్చిన వరదనీటిని బయటికి పంపేందుకు వీలుగా ఈ రోడ్డును అధికారులు కొట్టేశారు. అప్పటికప్పుడు ప్యాచ్ వర్కులు చేసి మమ అనిపించినా తర్వాత నుంచి రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఎక్సకవేటర్‌తో రోడ్డును సమాంతరం చేసే పనులు ప్రారంభించారు. అంతలోనే ఏం జరిగిందో ఏమోగానీ తర్వాతి రోజు నుంచి పనులు ఆగిపోయాయి. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు తవ్వడంతో రోడ్డంతా గోతులమయంగా మారింది. అంతేకాక వాహనాల రాకపోకలకు విపరీతంగా దుమ్ము రేగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

సంపద తయారీ కేంద్రం డీపీవో పరిశీలన

కూచిపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మొవ్వలో సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారిణి జె.అరుణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పారిశుధ్య కార్మికులకు తగు సూచనలు చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, కార్యదర్శి సోమేశ్వరరావు, మొవ్వ -1, 2 సచివాలయాల కార్యదర్శులు మహేష్, భారతి పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో అరుణ

రహదారి అధ్వానం

● రహదారి నిర్మాణంలో ప్రభుత్వాలు ఉదాసీనత ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి గుడ్లవల్లేరు) :నిత్యం వందలాది వాహనాల రాకపోకలు, వేలాది మంది ప్రయాణించే మూడు జిల్లాలను కలిపే గుడ్లవల్లేరు - ముదినేపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారి నిర్మాణంలో ప్రభుత్వాలు ఉదాసీనత కనబరుస్తున్నాయి. మచిలీపట్నం నుంచి భీమవరం, కైకలూరు, పాలకొల్లు వంటి పట్టణాలకు, గుడ్లవల్లేరు నుంచి ముదినేపల్లి వరకూ పదుల సంఖ్యలో గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఇంత ప్రాధాన్యత ఉన్నా కూడా ఈ రహదారిపై పాలకులకు దృష్టి సారించడం లేదు. గత ప్రభుత్వంలో ఈ రహదారిని గాలికి వదిలేశారు. ఎన్నికల ముందు మాత్రం తూతూ మంత్రంగా కొద్దిగా ప్యాచ్ వర్క్ చేసి మమా అనిపించారు. అవి ఎన్నికలు పూర్తయ్యేలోగా మళ్లీ గుంతలు పడ్డాయి.

గుడ్లవల్లేరు నుంచి విన్నకోట మధ్య కూరాడ, దగ్గుమిల్లి రోడ్డు సమీపాల్లో రహదారి అధ్వానంగా ఉంది. నిత్యం ఉద్యోగాలకో, మండల కేంద్రాలకో దాదాపు పది గ్రామాలకు ఈ రహదారే దిక్కు. ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి తిరిగి జాగ్రత్తగా వస్తాడా లేదా అనే భయం గుపెట్లో ఆ ప్రాంత ప్రజలు జీవిస్తున్నారు. ఇప్పటికే నిత్యం ఏదో ఒక చిన్నా,పెద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రభుత్వం అయినా త్వరితగతిన రహదారికి కనీసం ప్యాచ్ వర్క్‌లు చేయించి ప్రయాణికులను కాపాడాలని కోరుతున్నారు. ఇక ఈ రహదారి వెంబడి నివాసితులది మరో సమస్య. ఇటీవల వరకూ వర్షాకాలం నీరు గోతుల్లో చేరి వాహనాలు వెళ్లేపుడు ఇళ్లలో పడటం, దోమలు చేరడం ఒక సమస్య అయితే, ఇపుడు వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి ఇళ్లలోకి రావడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని కూరాడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక లోపలి గ్రామాలకు వెళ్లాలంటే ఆటో వాళ్లు అధిక కిరాయి వసూలు చేస్తున్నారని, ఈ రోడ్లలో ప్రయాణం అంటే రిపేర్లు వస్తున్నాయని ఆటో డ్రైవర్లు అంటున్నారు.


అధ్వానంగా ఉన్న గుడ్లవల్లేరు - ముదినేపల్లి రహదారి

దుమ్ముతో చస్తున్నాం కాపాడండి

రోడ్డు గుంతలు పడి వచ్చే పోయే వాహనాల దుమ్ములేచి ఇళ్లలో ఉండలేకున్నాం. ఊపిరితిత్తుల సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. పాలకులు త్వరగా రహదారి వేయించాలి.


ఆకుల శివయ్య - లాకుదిగువ, కూరాడ

రిపేరు పనులన్నా చేయించండి

మా స్వగ్రామం పురిటిపాడుకి వారంలో రెండు సార్లు అయినా వెళ్లేవాడిని. ఇపుడు ముదినేపల్లి రోడ్లో ప్రయాణించాలంటే భయం వేస్తోంది. గోతుల వల్ల ఆటోలు కూడా రానంటున్నారు. వెంటనే గుంతలు పూడ్చి రిపేరు పనులన్నా చేయించాలి.


శ్రీనివాస్, గుడ్లవల్లేరు

ప్రతిపాదనలు పంపాం

ముదినేపల్లి రహదారిలో అర్జెంట్ రిపేర్లకు ఎమ్మెల్యే రాము సూచనల మేరకు పనులకు ఎస్టిమేషన్లు చేసి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే రిపేర్లకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతాం. ఏడు మీటర్లకు రహదారిని విస్తరించే ప్రతిపాదనలు కూడా ఎమ్మెల్యే సూచనల మేరకు నాబార్డుకు ప్రతిపాదనలు వెళ్లాయి.

హరీష్ ఆర్అండ్‌బీ జేఈ ,గుడివాడ


ఇటుకలోడుతో బోల్తా పడిన ట్రాక్టర్

ట్రాక్టర్ టక్కు బోల్తా

పెదపారుపూడి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నుంచి విజయవాడ పెదపారుపూడి మండలం వానపాముల గ్రామం చిన్న వంతెన దగ్గర ట్రాక్టర్ టక్కు బోల్తా పడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వెంట్రప్రగడ నుంచి భూషణగుళ్ల వరకు అధ్వానంగా రోడ్లు ఉండటంతో నందమూరి ఇటుకల బట్టీ నుంచి లోడుతో బయలుదేరిన ట్రాక్టర్ వానపాముల వంతెన వద్ద బోల్తా పడింది. ఈ సంఘటనతో రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి స్థానికుల సహాయంతో ట్రక్కు లేపి ట్రాఫిక్ క్లియర్ చేశారు. గతంలో ఆర్టీసీ బస్సు, ట్రక్కు, ఆటో బోల్తా పడింది. రోజూ బైకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మోటూరులో ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

తాగునీటి చెరువు అభివృద్ధికి రూ.10లక్షలు

గుడివాడ రూరల్,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మోటూరు తాగునీటిచెరువు పూడితతీత పనులకు రూ.10లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారంరాత్రి మోటూరు తాగునీటి చెరువును ఆయన పరిశీలించారు. కొంతకాలంగా గ్రామస్తులు చెరువులో పూడికతీత పనులు చేయించాలని, కొంతమంది చెరువును నీటితో నింపాలని కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని తీగునీటి చెరువును ఆయన పరిశీలించారు. చెరువులో నీటిని పెట్టవద్దని, చెరువుగట్ల బలోపేతం, పూడికతీతకోసం రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తవ్వినమట్టిని బయటకు తరలించవద్దని, చెరువుగట్లను పటిష్టవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీనిధులు రూ.3.50లక్షలతో ఫిల్టర్‌బెడ్‌లు, పైప్‌లైన్‌ల మరమ్మతులు, మోటార్లను ఏర్పాటు చేయాలని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావుకు సూచించారు. పూడికతీత పనులలో ఏమైనా నగదు తగ్గినా తమవంతు సహకారం అందించాలని కూటమి నాయకులకు సూచించారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే టెండర్లు రద్దు చేస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తూడు తొలగింపు పనులలో కాంట్రాక్టర్లు పులిహోర పనులు మానుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తూడు తొలగింపు పనులకు కాంట్రాక్టర్లు 40 శాతం తక్కువకు వేసి కాలువలలో తూడు తొలగింపు పనులు చేయకుండా డబ్బులన్నీ జేబుల్లోనే నింపుకున్నారన్నారు. బుధవారం నందివాడ మండలం దోసపాడు చానల్‌కు వచ్చిన ఆయన పరిశీలించారు. జనార్ధనపురం నుంచి కాలువను ఇలపర్రు వరకు పరిశీలించగా, దోసపాడు పంట కాలువ నిండా తూడు కాలువ పూడుకుపోవటంతో వెనిగండ్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పద్ధతి మార్చుకోకపోతే తూడు తొలగింపు టెండర్లు రద్దు చేయటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ వరదల్లో దెబ్బతిన్న దోసపాడు చానల్‌ను దిగువ వరకు ఆధునీకరించి భవిష్యత్‌లో వరదలు వస్తే ముంపు సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ డీఈ భరత్, మండల టీడీపీ అధ్యక్షుడు సన్యాసిరావు, మండల నీటి సంఘాల అధ్యక్షులు ఏసుబాబు, యార్లగడ్డ రవి, వైస్ ఛైర్మన్ నంబూరి రాకేష్, డబ్ల్యూఏ అధ్యక్షుడు సురేష్, టీడీపీ మండల నాయకులు రవి, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ,డ్రైనేజీ ఏఈలు అనిల్, అరుణ్, పాల్గొన్నారు.


నీటి సంఘాల నాయకులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మినుములో ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలి

● ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు మినుము పైరులో ఎలుకల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. బుధవారం రామన్నపూడి, సీపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము పైరులో ఎలుకల బెడద వల్ల ఎకరాకు పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. ఎలుకల నివారణ చర్యలు ఒక యూనిట్‌గా తీసుకోవాలన్నారు. రైతులు ఎక్కువ దిగుబడి కోసం రెండు రకాల మందులు కొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. రసాయనిక మందులు ఎక్కువగా పిచికారి చేయటం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించి నడుచుకోవాలని కోరారు. మండల వ్యవసాయశాఖాధికారి బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని రైతులు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయంలో సంప్రదించాలని, ఎప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఫోన్ ద్వారా సంప్రదిస్తే సలహాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

ఎమ్మెల్సీ అభ్యర్థిగా లక్ష్మణరావును గెలిపిద్దాం : ఐక్య సంఘాలు

గుడివాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావును గెలిపిద్దామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్‌ల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్‌జీవోస్ హోంలో ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుకు మద్దతుగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లు యువత సమస్యలపై పోరాటం చేస్తున్నది పీడీఎఫ్ ఎమ్మెల్సీలేనని గుర్తు చేశారు. వీరి పోరాట ఫలితంగా పలు సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌ల సమస్యలపై పోరాడి వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ యిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి పి.రజిని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, వివిధ ప్రజాసంఘాల నాయకులు రమాదేవి, మల్లిఖార్జునరావు, పి.నాగేశ్వరరావు, రాంబాబు, ఖుద్దూస్, ఆర్.సురేష్, జి.రాజేంద్రప్రసాద్, అబ్దుల్ హమీద్, లంకా సురేంద్ర, టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆలపాటిని అఖండ మోజార్టితో గెలిపించండి

● మంత్రి వాసంశెట్టి సుభాష్


ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా అభ్యర్థిగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును అందించి అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆలపాటికి మద్దతుగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాతో కలసి మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛనిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం నిరుద్యోగులకు మోగా డీఎస్సీ ప్రకటించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర గెలుపు కోసం కూటమి నేతలకు కార్యచరణ ప్రణాళికను నిర్దేశించారు. కార్యక్రమంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, సందీప్, దాలిపర్తి ప్రసాద్, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల స్థితిగతులు తెలుసుకుంటున్న ఐ.పద్మారాణి

నూరు శాతం ఉత్తీర్ణతే ధ్యేయం

● జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి ఐ.పద్మారాణి

కూచిపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి ఐ.పద్మారాణి సూచించారు. కూచిపూడిలోని జడ్పీ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థుల ప్రతిభా పాటవాళ్లతోపాటు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ నెల 10న జరగనున్న ప్రీ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు వచ్చే మార్కుల ఆధారంగా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కనబర్చి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ పాఠశాల హెచ్ఎం వెంకట సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు మద్దతుగా బడ్జెట్

● సీఐటీయూ, రైతు సంఘం నేతల ఆందోళనలు

గుడివాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సమర్పించిన బడ్జెట్ ప్రజావ్యతిరేక విధానాలకు మద్దతుగా ఉందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మిక, కర్షక వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులపై భారం వేసి, కార్పొరేట్‌లకు రాయితీలివ్వడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వామ పక్షాలు ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ బడ్జెట్‌ను పరిగణన లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సీపీ రెడ్డి, నీలం మురళీ కృష్ణారెడ్డి, టి.లక్ష్మణ , వై.నరసింహరావు, కళ్ళం వెంకటేశ్వరరావు, ఒడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్ ప్రతులను తగలబెడుతున్న నేతలు


సంతకాల సేకరణ చేపడుతున్న భద్రతా దళం సభ్యులు

రెండో విడత పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభం

గుడివాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారిని అభివృద్ధి పరచాలని, భవిష్యత్ భద్రతా దళం కోర్టులో వేసిన ప్రజావ్యాజ్యం కేసు వెంటనే విచారణ జరపాలని కోరుతూ భద్రతా దళం సభ్యులు చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమం రెండో దశ బుధవారం ప్రారంభమైంది. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని వ్యాపారస్తులతో పోస్టు కార్డుల ద్వారా వినతుల పంపించే కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు ఎండీ తాహెర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తమిరిశ పంచాయతీ ఎస్సీ రిజర్వేషన్‌లో అవకతవకలు

నందివాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తమిరిశ పంచాయతీ ఎన్నికలకు ఎస్సీ రిజర్వేషన్ అవ్వటంతో ఇప్పుడున్న సర్పంచ్ బీసీ -సి సర్టిఫికెట్ ఎస్సీగా చూపించి ఎలక్షన్‌లో గెలుపొందారని అప్పటి నుంచి జిల్లా కలెక్టర్‌కు ఆమె చదువుకున్న బీసీ సర్టిఫికెట్ చూపించినా ఫలితం లేకపోయిందని టీడీపీ సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయిన కారే వెంకటరమణ ఆమె భర్త అర్జునరావు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వైసీపీ నాయకుల మాటలు విని పట్టించుకోలేదని వారు విమర్శించారు. బుధవారం తమిరిశ గ్రామంలో తమ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ గత నాలుగ సంవత్సరాలుగా ఎస్సీ సర్టిఫికెట్‌పై పోరాటం చేస్తున్నా ఫలితం దక్కటం లేదన్నారు. హైకోర్టులో పిటిషన్ వేయగా, అప్పటి వైసీపీ నాయకులు దొంగ సర్టిఫికెట్ పుట్టించి హైకోర్టుకు నివేదిక పంపారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీ ఎంక్వేరీ చేయగా, పాత కాగితాలే పై అధికారులకు పంపుతున్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేద్దామనుకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా వేయటం జరిగిందన్నారు. ఈ విషయమై మండల ప్రజాపరిషత్ అధికారిణి నాగమల్లేశ్వరిని వివరణ కోరగా, నేను ఎంక్వయిరీ అధికారిగా వెళ్లి వారు ఇచ్చిన నివేదికలు రిజిస్టర్ పోస్టు ద్వారా మచిలీపట్నం డీపీవోకి పంపినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలపై ఆరా



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులపై ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆరా తీశారు. జిల్లా మద్య నిషేధ కార్యాలయాన్ని బుధవారం కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం పరిధిలోని 12 షాపులకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో జిల్లా ఎక్సైజ్ అధికారి గంగాధర్, ఏఈఎస్ భార్గవ్, మచిలీపట్నం సీఐ ప్రకాష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పునాదులతోనే సరి!



- 2016లో నగర పాలక సంస్థకు రూ. కోటితో నూతన భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన
- వైసీపీ రివర్స్ టెండరింగ్‌తో నిలిచిపోయిన భవన నిర్మాణం

(మచిలీపట్నం టౌన్ - ఆంధ్రజ్యోతి)

బ్రిటీషు కాలం నాటి నగర పాలక సంస్థ కార్యాలయం శిథిలమైంది. కార్యాలయంలో వివిధ సెక్షన్లకు కావలసిన గదులు ప్రస్తుత లేవు. దేశంలోనే 3వ మునిసిపాలిటీగా రికార్డుల్లో నమోదైన మచిలీపట్నం నగర పాలక సంస్థగా రూపాంతరం చెందింది. అయినా సరైన కౌన్సిల్ హాలు లేదు. ఇంజనీరింగ్, మెప్మా, రెవెన్యూ, విద్య శాఖాలతో పాటు అసిస్టెంట్ కమిషనర్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్లకు సరైన చాంబర్లు లేవు. మేయర్, మునిసిపల్ కమిషనర్లతో పాటు డిప్యూటీ మేయర్లకు ప్రత్యేక చాంబర్లు లేవు. గతంలో ప్రతిపక్ష నాయకులకు చాంబర్ ఉండేది. ఇప్పుడు అదికూడా లేకుండా పోయింది. వర్షం వస్తే పాతకాలం నాటి భవనంలో అధికారులు, సిబ్బందికి అవస్థలు తప్పడంలేదు. సరైన టాయిలెట్లు లేవు. 2016 ఏప్రిల్ 30న నగర పాలక సంస్థకు రూ. కోటితో నూతన భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అప్పటి, ఇప్పటి మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి ఎంపీ, ప్రస్తుత ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భవన నిర్మాణ పనులు ప్రారంభమై పునాదుల్లోనే పనులు నిలిచి పోయాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో కార్యాలయ భవన నిర్మాణం కొనసాగించలేదు. తొమ్మిదేళ్లయినా కార్యాలయ నిర్మాణం జరగలేదు. ప్రస్తుత పాలకులు భవన నిర్మాణాన్ని కొనసాగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన నగర పాలక సంస్థ కార్యాలయ భవనం

గుంతలు పూడ్చివేత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రద్దీగా ఉండే పోర్టు రోడ్డులోని గోతులను మునిసిపల్ అధికారులు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రమాదాలు జరుగుతుండటంతో మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేయిస్తున్నారు.

చెక్కు అందజేత

నాగాయలంక, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు, వాక్యోపదేశకులకు టీఎస్ఆర్ గ్రూపు చైర్మన్ తిరుపతి శ్రీనివాస రావు అండగా ఉంటారని ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు మండలి కిరణ్ అన్నారు. ఫాస్టర్ ఫెలోషిక్‌కు టీఎస్ఆర్ గ్రూపు చైర్మన్ శ్రీనివాసరావు బుధవారం రూ.లక్ష చెక్ అందజేశారు. కార్యక్రమంలో కోట కరుణకుమార్, సభ్యులు, దైవ సేవకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శేషాచార్యులు

దివ్యజ్ఞాన సమాజం నూతన అధ్యక్షుడిగా లంకిశెట్టి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం నూతన అధ్యక్షుడిగా న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ఎన్నికయ్యారు. ఈడేపల్లి దివ్యజ్ఞాన సమాజంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆడిటర్ సి.శేషాచార్యులు గౌరవాధ్యక్షుడిగా ఎన్నియ్యారు. అధ్యక్షుడిగా లంకిశెట్టి బాలాజీ, కోశాధికారిగా ఎం.సత్యనారాయణ, సొసైటీ కార్యదర్శిగా కొత్తగుండు రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సవరం వెంకటేశ్వరరావు, గుడిసేవ మురళీధర్, ఎంఎస్‌వి ప్రసాద్, వైచలపతిరావు, నాగమల్లేశ్వరమ్మ, విజయ చాముండేశ్వరి మాట్లాడారు.

టీడీపీ నేత కోటయ్య మృతి

పెడన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు, చేనేత ప్రముఖుడు బూసం కోటయ్య (80) మంగళవారం మృతిచెందారు. తెలుగుదేశం పార్టీకి వీరాభిమానిగా పేరొందిన కోటయ్య పట్టణ పరిధిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేశారు. సదాశివలింగేశ్వర చేనేత సహకార సంఘానికి రెండుసార్లు అధ్యక్షుడుగా వ్యవహరించిన కోటయ్య ఆ సంఘ అభివృద్ధికి కృషి చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం కోటయ్య భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, పులి రవికుమార్, బళ్ల గంటేశ్వరరావు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ డైరీ ఆవిష్కరణ

పెడన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ డైరీ - 2025ను మునిసిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు బుధవారం తమ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన ఈ డైరీలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఎంతో విలువైన సమాచారం ఉందన్నారు. విధి నిర్వహణలో ప్లానింగ్ సెక్రటరీలకు డైరీ మార్గదర్శిగా ఉంటుందన్నారు.

యోగాతో ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ యోగి రామ్‌లాల్ ప్రభూజీ చూపిన యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, విద్యాలంకార్ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణశర్మ అన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం వివేకానంద మందిరం, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శివరామకృష్ణ శర్మ ధార్మిక ఉపన్యాసాలు ఇచ్చారు. పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య, శింగరాజు గోవర్ధన్, ఘంటసాల గురునాథ బాబు, కృష్ణ, మృత్యుంజయుడు, ఎస్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కుప్పా రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



వేద విద్వత్ సభలో చతుర్వేద పండితులు

వైభవంగా వేదవిద్వత్ సభ

మోపిదేవి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం వేద విద్వత్ సభ వైభవంగా జరిగింది. రాష్ట్రంలోనిప్రముఖ పుణ్యక్షేత్రాల నుంచి 40 మంది చతుర్వేద పండితులు విచ్చేశారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు వేదపండితులను సత్కరించారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ వేద ఘోష జరిగిన ప్రాంతం పాడిపంటలతో ఉంటుందన్నారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతనంగా చేపట్టిన తెప్పోత్సవంతో ఈ ప్రాంతంలో వర్షాలు, నీటితో సమృద్ధిగా విరాజిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా వేదపండితులను నూతన వస్త్రాలతో ఆలయ అధికారులు సత్కరించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న కలెక్టర్ బాలాజీ



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు వారికి స్వాగతం పలుకగా, నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే వేదవిద్వత్ సభలో కలెక్టర్ దంపతులు పాల్గొనగా, వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు కలెక్టర్ దంపతులకు అందజేశారు. తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వో బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ : అక్కినేని వనజ



మోదుమూడి లలితాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వనజ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పేదలకు అండగా ఉంటూ సమస్యలపై పోరాడుతుందని జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ఆదర్శ కమ్యూనిస్టు నాయకురాలు మోదుమూడి లలితాదేవి వర్ధంతి సభ బుధవారం జరిగింది. భాస్కరపురంలో సీపీఐ నాయకురాలు దేవభక్తుని నిర్మల అధ్యక్షతన జరిగిన సభలో వనజ మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ నాయకురాలిగా లలితాదేవి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెనుమత్స దుర్గాభవాని, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వెలగపూడి ఆజాద్, మోదుమూడి రామారావు, కట్టా హేమ సుందరరావు, కోదాటి నారాయణ, లింగం ఫిలిప్, చిన్న కొండయ్య, యర్రంశెట్టి ఈశ్వరరావు, చైతన్యకుమార్, ఓడుగు రత్నకుమారి పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు

ఉత్సాహంగా ఆటల పోటీలు

ఘంటసాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్‌లో 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ ఆటల పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రన్నింగ్ 100 మీటర్లు, 200 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 3కే రన్, వాకింగ్, జంపింగ్ విభాగాల్లో లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, పోల్ జంప్, త్రోయింగ్ విభా గంలో డిస్కస్ త్రో, షాట్ పుట్, హెమర్ త్రో, జావెలిన్ త్రో పోటీలను ప్రారంభించారు. పోటీలను లాన్ టెన్నిస్ జాతీయ కోచ్ అన్నే రత్నాకర్‌రావు ప్రారంభించారు. సీనియర్ విభాగం వాలీబాల్ ఫైనల్ పోటీల్లో పాండురంగా మున్సిపల్ హైస్కూల్ చిలకలపూడి, జడ్పీ హెచ్ఎస్ మాట్లం జట్టు హోరాహోరిగా తలపడగా, జడ్పీ హెచ్ఎస్ మాట్లం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, అత్తలూరి గోపిచంద్, పీడీ అండ్ సీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి మాశిలామణి, విశ్రాంత ఎంఈవో గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు, పీడీ మారుతి, సింహాద్రి గంగాధరమ్, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఆలపాటి విజయానికి కృషి చేయాలి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. గూడూరులో టీడీపీ, జనసేన, బీజేపీ క్లస్టర్ల ఇన్‌చార్జిలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో 30 మంది ఓటర్లకు ఒక ఇంచార్జిని నియమించేలా మండల నాయకులు చూడాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ నియోజక పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు, గోపి నాగబాబు, దాసరి ఉమా సాయిరాం, అన్నం హరి రామకృష్ణ, ఎన్ఏ బేగ్, కట్టా మునేశ్వరరావు, శయన సోమయ్య, శ్రీను, పోతన రామోజీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : మండల ప్రభుత్వ ఖాజీగా నియమితులైన అమానుల్లా బేగ్‌కు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, కార్పొరేషన్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కూటమి నాయకులు ఉమా సాయిరాం, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, సలీమ్, రోషన్, అజీమ్ తదితరులు అభినందనలు తెలిపారు.

పెడన : ఉమ్మడి కృష్ణాగుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా టీడీపీ నాయకుడు తమ్మా బీమయ్య పట్టణంలోని 7వ వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఏడో వార్డులోని పట్టభద్రులను కలసి సేవా దృక్పథం కలిగిన రాజేంద్రప్రసాద్‌కు విజయం చేకూర్చాలని కోరారు. మాజీ కౌన్సిలర్ యర్రా నాగరాజు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

అవనిగడ్డ : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని అవనిగడ్డలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ప్రచారాన్ని ప్రారంభించారు. అవనిగడ్డ హైస్కూల్, జూనియర్ కళాశాలలో బుధవారం ఉపాధ్యాయులు, అధ్యాపకులను పని గంటలు ముగిసిన తర్వాత కలసి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే కనక దుర్గ, బచ్చు కృష్ణకుమారి, కూనపరెడ్డి చంద్రశేఖర్, కొట్టే విజయ్, గుడివాక మల్లిఖార్జునరావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, కొండవీటి పాండురంగారావు పాల్గొన్నారు.

ప్రజల అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాలు



పెడన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా నూతన రంగులు, డిజైన్లతో చేనేత వస్త్రాలను తయారు చేయించాలని చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి సూచించారు. పెడన పట్టణంలోని నార్త్‌గాంధీ చేనేత సహకార సంఘం, సదాశివలింగేశ్వర చేనేత సహకార సంఘాలను బుధవారం ఆమె సందర్శించారు. ఆ సంఘాలు ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాలను పరిశీలించారు. సంఘాలలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని ఝాన్సీ కలంకారీ యూనిట్‌ను కూడా ఆమె సందర్శించా రు. జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సూర్యనమస్కారాలు

అవనిగడ్డ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్యనమస్కార పోటీలకు విశేష స్పందన లభించింది. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఆసన భంగిమలను చేసి చూపించగా, కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు వంగర శేషగిరిరావు, సింహాద్రి రవీంద్ర, డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

అందుబాటులో గుండెకు భరోసా వైద్యసేవలు

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ గుండెకు భరోసా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ వి.నరేంద్ర తెలిపారు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను ఆసుపత్రి వైద్య బృందంతో కలసి వివరించారు. ఛాతినొప్పి వచ్చిన గంట వ్యవధిలో ఆసుపత్రికి తీసుకువచ్చినట్లైతే వ్యాధి నిర్ధారణ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఖాన్, హరిరంగ ప్రసాద్, ఇనాయత్ అలీ, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

పెడన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన బుధవారం ప్రశాంతంగా జరిగింది. సమావేశంలో అజెండాలోని నాలుగు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 10 నుంచి పట్టణంలో ప్రారంభం కానున్న చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలను పురస్క రించుకుని 14 రోజుల పాటు అదనంగా రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకోవాలని, 8 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో కమిషనర్ మన్నం గోపాలరావు, టీపీవో సుజనకుమారి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమల్లేశ్వరరావు, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ శివకుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు ట్రాఫిక్ సీఐ

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శన



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దొంతులమ్మ ఆరాధనోత్స వాల సందర్భంగా బుధవారం బాలా త్రిపుర సుందరీ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. వై. హరిణి తరంగం, జాహ్నవి అన్నమాచార్య కీర్తన, సాయిపూర్ణ కొలువైతివ రంగసాయి, లితిక్ వినాయక కౌతం, రస్విత్రశ్రీ శబ్దాభినయం చేశారు. నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు కార్యక్రమానికి నృత్య దర్శకత్వం వహించారు. హార్మోనియంపై కె.శ్రీనివాస్, మృదంగంపై పి.దేవకిషోర్‌లు సహకరించారు.

రాష్ట్రపతి ప్రశంసలందుకున్న దీప్తికి ఘనస్వాగతం



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్‌డే సందర్భంగా రాష్ట్రపతి ముర్ము వద్ద వీణావాదనం చేసి ప్రశంసలందుకున్న అప్పికట్ల దీప్తి బుధవారం డిల్లీ నుంచి తిరిగి మచిలీపట్నం వచ్చారు. ఈ సందర్భంగా మూడు స్తంభాల సెంటర్, చల్లరస్తా సెంటర్, కోనేరుసెంటర్ మీదుగా ఆమెను ఇంటికి ఊరేగింపుగా సంగీతాభిమానులు, స్నేహితులు తీసుకుని వెళ్లారు. కార్యక్రమంలో దీప్తి తండ్రి అశ్వనికుమార్, తల్లి నాగలక్ష్మి, స్నేహితులు ఘన స్వాగతం పలికారు.

క్రీడాకారిణి గాయత్రికి అభినందన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ స్థాయి క్రీడల్లో మహిళల కానోస్‌లాలోమ్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన నాగాయలంక క్రీడాకారిణి నగిడి గాయత్రిని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి అభినందనలు తెలిపారు. సామాన్య కుటుంబంలో జన్మించిన క్రీడాకారిణి గాయత్రి భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని బహుమతులు అందుకోవాలని కొల్లు రవీంద్ర ఆకాంక్షించారు.

బాలిక మిస్సింగ్‌పై ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బందరు రూరల్ మండలం ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్టు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు బెంగళూరు తీసుకెళ్లినట్టు సమాచారం అందడంతో రూరల్ పోలీసులు బెంగుళూరు వెళ్లి బాలికను తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడు వంశీపై పోలీసులు కేసు నమోదు చేశారు.